సాక్షి
పశ్చిమగోదావరి
గురువారం । 19 । డిసెంబర్ । 2024



రాగివైరు చోరీ ముఠా అరెస్ట్

ట్రాన్స్‌ఫార్మర్లలో రాగి వైరు చోరీ ముఠాను ఏలూరు జిల్లా పోలీసులు అరెస్ట్ చేశారు. మెట్టలోని పలు ప్రాంతాల్లో రాగివైరును చోరీ చేసినట్లు పోలీసులు తెలిపారు. 8లో ▸



వేధిస్తున్న హెచ్‌ఐవీ కిట్ల కొరత

ఆస్పత్రుల్లో హెచ్‌ఐవీ పాజిటివ్ నిర్ధారణ కిట్ల కొరతతో రోగులు వేచిచూడాల్సిన దుస్థితి. స్టాక్ లేక ఒక సెంటర్ నుంచి మరో సెంటర్‌కు సర్దుబాటు చేస్తున్నారు. 8లో



నిర్మాణంలో జాప్యం

నూజివీడు పీజీ కేంద్రం ఆవరణలో అకడమిక్ భవన నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. కేవలం 5 శాతం పనులు గత ఆరునెలల నుంచి సాగడం లేదు. 8లో ▸

న్యూస్‌రీల్

చెస్‌లో నిట్ జయకేతనం



చెస్‌లో విజయం సాధించిన ఏపి నిట్ మహిళా సభ్యులు

తాడేపల్లిగూడెం: అసోంలోని సిల్చర్ నిట్‌లో ఈ నెల 13 నుంచి 17 వరకు ఐదు రోజుల పాటు నిర్వహించిన ఆలిండియా ఇంటర్ ఎన్ఐటీ మహిళా ఫ్యాకల్టీ స్టాఫ్ చదరంగం పోటీలు 2024లో ఏపి నిట్ ప్రథమస్థానంలో నిలిచింది. సిల్చర్ నిట్ డైరెక్టర్ చేతుల మీదుగా ఏపి నిట్ బృందం బహుమతి అందుకుంది. యెగ్గిన దీపిక కుమారి, దేవిన చైతన్య, చెక్కపల్లి కాశీఅన్నపూర్ణ సభ్యులుగా ఉన్న ఈ బృందానికి నిట్ డైరెక్టర్ ఎన్వి రమణరావు తదితరులు అభినందనలు తెలిపారు.

21న జెడ్పీ ప్రత్యేక సమావేశం

ఏలూరు(మెట్రో): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా జెడ్పీటీసీల అభ్యర్థన మేరకు ఈ నెల 21న ఉదయం 10 గంటలకు ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నట్లు జెడ్పీ ఇన్‌చార్జి సీఈఓ ఆర్.విజయరాజు ఒక ప్రకటనలో తెలిపారు. 21న మధ్యాహ్నం 2 గంటలకు జెడ్పీ సర్వసభ్య సమావేశం చైర్‌పర్సన్ అధ్యక్షతన జరుగుతుందన్నారు.

ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధం



రాజీవ్ రంజన్ మిశ్ర కమిషన్‌కు వినతిపత్రం అందజేస్తున్న మంగరాజు తదితరులు

తాడేపల్లిగూడెం(టీఓసీ): ఎస్సీలను ఏబీసీడీలుగా విభజించడం రాజ్యాంగ విరుద్ధమని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటి మిల్లి మంగరాజు అన్నారు. విశాఖపట్నంలోని కలెక్టర్ కార్యాలయంలో రాజీవ్ రంజన్ మిశ్ర కమిషన్‌ను బుధవారం కలిసి వినతిపత్రం అందజేసినట్లు మంగరాజు తెలిపారు. సుప్రీం కోర్టు తీర్పు రాజ్యాంగ విరుద్ధమన్నారు. హైదరబాద్‌లో జరిగిన మాదిగల సభలో ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొని ఎస్సీ వర్గీకరణ చేయిస్తానని హామీ ఇవ్వడం సరికాదన్నారు. కుల గణన జరగకుండా ఎస్సీ, ఎస్టీలను ఎలా వర్గీకరణ చేస్తారని ప్రశ్నించారు.

పేరుపాలెం బీచ్ పర్యాటకులకు భద్రత



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి, ఎస్పీ అద్నాన్ నయీం అస్మి

భీమవరం(ప్రకాశం చౌక్): పేరుపాలెం బీచ్ పర్యాటకులు, మత్స్యకారుల భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ వశిష్ట సమావేశ మందిరంలో ఎస్పీ అద్నాన్ నయీం అస్మితో కలిసి మెరైన్, మత్స్యశాఖ అధికారులతో పేరుపాలెం బీచ్ పర్యాటకుల భద్రతపై సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ బీచ్‌లో స్నానాలు చేసే వారి భద్రతకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలన్నారు. ఈతగాళ్ల ఏర్పాటు, బోట్లతో పహరా, ప్రమాద హెచ్చరిక బోర్డులు తదితర చర్యలు తీసుకోవాలన్నారు. వేటకు వెళ్లే ఫిషింగ్ బోట్లకు ట్రాన్స్‌పాండర్లను బిగించుకోవడం వల్ల తుఫాను సమయాల్లో బోట్లు ఏ ప్రాంతంలో ఉంది సులువుగా తెలుసుకోవచ్చన్నారు. మెరైన్ పీఎస్ సీఐ ఏఎస్ఎం మూర్తి సముద్ర పర్యాటకుల ప్రమాదాల నివారణకు చేపట్టవలసిన చర్యలపై ప్రతిపాదనలు సభలో వివరించారు.

20 నుంచి ఆర్టీసీ కార్గో మాసోత్సవం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఏలూరు డిపో పరిధిలో ప్రయాణికుల సౌకర్యార్థం కార్గో డోర్ డెలివరీ మాసోత్సవ కార్యక్రమం ఈనెల 20 నుంచి జనవరి 19 వరకూ నిర్వహించనున్నట్లు ఆర్టీసీ ఏలూరు డిపో మేనేజర్ బీ.వాణి ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్టీసీ కార్గోలో బుక్ చేసిన కేజీ నుండి 50 కేజీల వరకు బరువున్న వస్తువులను పది కిలోమీటర్ల పరిధి వరకు డోర్ డెలివరీ చేస్తామన్నారు.

చివరిలో వాయుగండం

- తుది దశకు ఖరీఫ్ మాసూళ్లు
- 85 శాతం పూర్తయిన వరికోతలు
- అల్పపీడనం ప్రభావంతో బెంబేలెత్తుతున్న అన్నదాతలు
- ధాన్యాన్ని కాపాడుకునేందుకు ఉరుకులు పరుగులు



వీరవాసరం మండలంలో సార్వా ధాన్యం వర్షానికి తడవకుండా బరకాలు కప్పిన దృశ్యం

సాక్షి, భీమవరం/భీమవరం: ఖరీఫ్ సాగు చివరిలోనూ రైతులకు కష్టాలు తప్పడం లేదు. తుది దశ మాసూళ్లు ముమ్మరంగా జరుగుతున్న తరుణంలో వాతావరణంలోని మార్పులు ఆందోళనకు గురిచేస్తున్నాయి. జల్లుల నుంచి కళ్లాల్లోని ధాన్యాన్ని కాపాడుకునేందుకు ఉరుకులు పరుగులు పెడుతున్నారు.

జిల్లాలోని 2.05 లక్షల ఎకరాల్లో తొలకరి సాగు చేశారు. ఇంతవరకు 85 శాతం విస్తీర్ణంలో వరి కోతలు పూర్తయ్యాయి. ముందుగా సాగుచేసిన తాడేపల్లిగూడెం, తణుకు, భీమవరం ప్రాంతాల్లో ఇప్పటికే పంట ఒబ్బిడి కాగా సాగు ఆలస్యమైన ఆచంట, పెనుగొండ, యలమంచిలి, పెనుమంట్ర, పోడూరు తదితర చోట్ల అక్కడక్కడ కోతలు, ధాన్యం ఒబ్బిడి చేసుకునే పనిలో రైతులు నిమగ్నమై ఉన్నారు. ఈ సీజన్‌లో 4.1 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యం కాగా ఇంతవరకు జిల్లాలోని 257 రైతు సేవా కేంద్రాల ద్వారా రైతుల నుంచి 3.37 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ పూర్తయ్యింది. కోతలు పూర్తయిన మేర ఇంకా రైతుల వద్ద 40 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. కొద్దిరోజులుగా వాతావరణం అనుకూలంగా ఉండటంతో పూర్తిస్థాయిలో మద్దతు ధర పొందేందుకు వీలుగా తేమ శాతం తగ్గించుకునేందుకు ధాన్యాన్ని ఆరబెట్టుకుంటున్నారు.

ఆందోళన కలిగిస్తున్న వాతావరణం

బంగాళాఖాతంలో వాయుగుండం ప్రభావంతో రెండు రోజులుగా వాతావరణం ఆకాశం మేఘావృతమైంది. ఆకాశం మేఘావృతమై చలిగాలుల తీవ్రత పెరగడంతో ధాన్యాన్ని రోడ్డు పక్కన రాశులుగా పోసి బరకాలు కప్పి ఉంచారు. రానున్న రెండు రోజుల్లో విస్తారంగా వర్షాలు కురుస్తాయన్న వాతావరణశాఖ హెచ్చరికలు వారిని బెంబేలెత్తిస్తున్నాయి. బుధవారం ఆచంట, పాలకొల్లు, పెనుగొండ, తణుకు, పోడూరు తదితర చోట్ల జల్లులు పడటంతో ధాన్యం తడకుండా కాపాడుకునేందుకు ఉరుకులు పరుగులు పెట్టారు.

ప్రారంభం నుంచి కష్టాలే

ఈ ఖరీఫ్ సీజన్ ప్రారంభం నుంచి రైతులకు కష్టాలనే మిగిల్చింది. నాట్ల దశలోనే భారీ వర్షాలు, వరదలు పంటకు చేటు చేశాయి. ఆగస్టు చివరిలో కురిసిన వర్షాలకు వయ్యేరు, ఎర్రకాలువ, యనమదుర్రు, ఉప్పుటేరు తదితర డ్రెయిన్లు పొంగి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా దాదాపు 70 వేల ఎకరాల్లోని నాట్లు, నారుమడులు దెబ్బతిని పెట్టుబడులు రెట్టింపయ్యాయి. సెప్టెంబరు మొదటివారంలో గోదావరి, కొల్లేరు వరదలతో మరోమారు నష్టం వాటిల్లింది. వరికోతలు మొదలైన డిసెంబరు మొదటి వారంలో వచ్చిన ఫెంగల్ తుపాను కంటి మీద కునుకులేకుండా చేసింది. ఈ సీజన్‌లో 75 కేజీల బస్తాకు కేంద్ర ప్రభుత్వం రూ. 1725 మద్దతు ధరగా నిర్ణయించింది. తేమశాతం ఎక్కువగా ఉందన్న సాకు చూపించి దళారులు, మిల్లర్లు బస్తాకు రూ.200 నుంచి రూ.250 వరకు కోతపెట్టారు. కొద్ది రోజులుగా వాతావరణం అనుకూలించడంతో పనులు ముమ్మరమయ్యాయి. మరో వారం పదిరోజుల్లో మిగిలిన రైతులు పూర్తిగా గట్టెక్కుతారనుకుంటున్న సమయంలో మరోమారు వాయుగుండం కలవరపరుస్తోంది.

నారుమడులకు ఇబ్బంది

రైతులు దాళ్వా నారుమళ్లలో బిజీ ఉన్నారు. జిల్లాలో దాళ్వా సీజన్‌లో 2.25 లక్షల ఎకరాల్లో నాట్లు వేయాల్సివుండగా 8,500 ఎకరాల్లో నారుమళ్లు వేయాల్సివుంది. ఇప్పటికే దాదాపు 2 వేల ఎకరాల్లో నారుమళ్లు పూర్తిచేసినట్లు అంచనా. గత నాలుగు రోజులుగా ఎక్కువ మంది రైతులు నారుమళ్లకు విత్తనాలు వేశారు. వర్షం జల్లులు, భూమి ఆరకపోవడంతో విత్తనాలు పోగులు పడడంతోపాటు సరిగా మొలకెత్తవని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అల్పపీడనం మరింత బలపడి మరో మూడు రోజులు పాటు వర్షాలు పడే అవకాశముందని వాతావరణశాఖ ప్రకటించడంతో రైతులు మరింత ఆందోళన చెందుతున్నారు.



భీమవరం మండలంలో ఇటీవల వేసిన దాళ్వా నారుమడి

ఈ జాగ్రత్తలు పాటించాలి

- రానున్న రెండు మూడు రోజులలో వరి కోతలు వాయిదా వేసుకోవాలి.
- కళ్లాల్లో ధాన్యాన్ని సురక్షితమైన ప్రాంతంలో వర్షానికి తడవకుండా బరకాలు కప్పి ఉంచాలి. వీలుకాని పక్షంలో సంబంధిత రైతు సేవా కేంద్రం ద్వారా కనీస మద్దతు ధర్పై తేమ శాతానికి అనుగుణంగా ధాన్యాన్ని అమ్ముకోవచ్చు.
- నీరు నిలవకుండా ఉండేందుకు బయటకి వెళ్లే మార్గాన్ని ముందుగానే సరి చూసుకోవాలి.
- ధాన్యం తడిస్తే రంగు మారకుండా, మొలకెత్తకుండా 5 శాతం ఉప్పు ద్రావణాన్ని పిచికారీ చేయాలి.

ఏమైనా సందేహాలుంటే సంబంధిత రైతు సేవా కేంద్రాల్లోని వ్యవసాయ అధికారులను సంప్రదించాలి. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ 8121676653/ 18004251291 నంబర్‌కు కాల్‌చేసి అనుమానాలు నివృత్తి చేసుకోవచ్చు.

జిల్లా అభివృద్ధికి బ్యాంకర్లు సహకరించాలి



ఆర్థిక అక్షరాస్యతపై బ్రోచర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్ నాగరాణి తదితరులు

భీమవరం (ప్రకాశంచౌక్): రాష్ట్ర ప్రభుత్వ విజన్‌కు అనుగుణంగా జిల్లా అభివృద్ధికి బ్యాంకర్లు తమ వంతు సహకారం అందించాలని, విరివిగా రుణాలు మంజూరు చేయాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. బుధవారం కలెక్టరేట్ మీకోసం సమావేశ మందిరంలో కలెక్టర్ అధ్యక్షతన డీసీసీ, డీఎల్ఆర్‌సి(బ్యాంకర్ల) సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కౌలు రైతులకు విరివిగా రుణాలు మంజూరు చేయాలన్నారు. అవసరమైన పత్రాలు అందజేయడానికి వ్యవసాయ శాఖ సిద్ధంగా ఉందని తెలిపారు. వ్యక్తిగత రుణాలను సాకుగా చూపించవద్దని, వ్యవసాయ రుణం తప్పనిసరిగా మంజూరు చేయాలన్నారు. ఈ ఆర్థిక సంవత్సరానికి 1,08,330 సీసీఆర్సీ కార్డులు జారీ లక్ష్యం కాగా ఇంతవరకు 87,178 కార్డులు జారీ చేశామన్నారు. ఖరీఫ్ సీజన్‌లో రూ.361 కోట్ల పంట రుణాలు అందజేశామన్నారు. ఈ సీజన్‌లో రూ.410 కోట్ల రుణాలు లక్ష్యం కాగా ఇప్పటికే రూ.162 కోట్ల రుణాలు అందించినట్లు చెప్పారు. నాబార్డ్ ఏజీఎం ఆర్.కె.హనుమ కుమారి మాట్లాడుతూ రుణాలు మంజూరు త్వరితగతిన పూర్తిచేయాలని సూచించారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆర్ఎం పి.సంగీత కుమారి మాట్లాడుతూ బ్యాంకర్లు కౌలుదారులకు రుణాలు అందించే విషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ఆర్థిక అంశాల అవగాహనపై సందేహాలు, సమాధానాలు, ఆన్‌లైన్ మోసాలపై జాగ్రత్తలకు సంబంధించిన బుక్‌లెట్స్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, లీడ్ బ్యాంక్ మేనేజర్ ఏ.నాగేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పాత సంచులే దిక్కు

ఒక పక్క మద్దతు ధర లేదు.. ధాన్యం కొనుగోళ్లలో దళారీలదే రాజ్యం. అయిన కాడికి అమ్ముకుంటున్న రైతులకు కనీసం సంచులు ఇవ్వాల్సిన బాధ్యతను విస్మరించారు.. నిత్యం సమీక్షలు, రోజూ కొనుగోలు చేస్తున్నామంటూ ప్రకటనలు.. వారానికి రెండు సార్లు క్షేత్రస్థాయిలో జాయింట్ కలెక్టర్ల పర్యటనలు తప్ప ధాన్యం కొనుగోళ్లలో సంచుల కొరతపై ఎలాంటి చర్యలు లేవు.

- తుది దశకు ధాన్యం కొనుగోళ్లు
- ఉమ్మడి పశ్చిమగోదావరిలో 1.50 కోట్ల సంచుల అవసరం
- 10వ వంతు కూడా సరఫరా చేయని వైనం
- పాత సంచులు, రీసైక్లింగ్ సంచులతో ధాన్యం తరలింపు



రెండ్రోజుల క్రితం పట్టిసీమలో గోనె సంచులు పరిశీలిస్తున్న మంత్రి నాదెండ్ల మనోహర్ (ఫైల్)

సాక్షి ప్రతినిధి, ఏలూరు : చివరిలో కూడా గోనె సంచులు ఇవ్వలేని పరిస్థితి. రెండ్రోజుల క్రితం జిల్లా పర్యటనకు వచ్చిన ఇన్‌చార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ పట్టిసీమలో ధాన్యం కొనుగోళ్లను పరిశీలించగా చిరిగిన సంచులే ఇస్తున్నారని, చాలా చోట్ల సంచులు అందుబాటులో లేవని రైతులు చెప్పడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ఖరీఫ్ సీజన్ దాదాపు ముగింపు దశకు చేరుకుంది. ఏలూరు జిల్లాలో 75 శాతం, పశ్చిమగోదావరి జిల్లాల్లో 85 శాతం మేర కొనుగోళ్లు పూర్తయ్యాయి. ఏలూరు రూరల్, పెదపాడు, దెందులూరుతో పాటు మరికొన్ని చోట్ల ఇంకా కొనుగోళ్లు సాగుతున్నాయి. పశ్చిమగోదావరి జిల్లాలోని ఆచంట, పెనుగొండ, యలమంచిలి, పోడూరు ప్రాంతాల్లో కొనుగోళ్లు చివరి దశలో ఉన్నాయి. ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో 15 శాతం మేర నారుమడులు, 10 శాతం మేర విస్తీర్ణంలో రబీ నాట్లు కూడా ప్రారంభమయ్యాయి. గత ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ధాన్యం సేకరణలో ఇంకా అవరోధాలు కొనసాగుతూనే ఉన్నాయి. ఏలూరు జిల్లాలో 2.10 లక్షల ఎకరాల విస్తీర్ణంలో 5.60 లక్షల టన్నుల దిగుబడి రాగా దీనిలో 60 శాతం మేర అంటే 3.40 లక్షల టన్నులు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని ప్రకటించారు. పశ్చిమగోదావరి జిల్లాలో 2.05 లక్షల ఎకరాల విస్తీర్ణంలో 6 లక్షల టన్నుల దిగుబడి రాగా 4.10 లక్షల మెట్రిక్ టన్నులు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని ప్రకటించారు.

కొనుగోళ్ల నుండే దగా

దళారీ వ్యవస్థకు రాచమార్గం వేసేలా రైతుకు నచ్చిన మిల్లుల్లో విక్రయించుకోవచ్చని ప్రకటించడంతో ఖరీఫ్ సీజన్ మొత్తం దళారీలకు కాసులు కురిపించింది. 75 కేజీల ధాన్యం బస్తాకు రూ.1,725 మద్దతు ధర ఉన్నప్పటికి దళారులు రూ.1,300 నుంచి రూ. 1,500 లోపే కొనుగోలు చేశారు. రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో విక్రయాలకు తేమ శాతం ఎక్కువగా ఉందని, ధాన్యం సంచులు అందుబాటులో లేవని ఇలా రకరకాల కారణాలతో చివరికు దళారులకు అమ్మేలా పరోక్షంగా సహకరించారు. దళారుల అధికారికంగా ధాన్యం కొనుగోళ్ళు కేంద్రాల్లో విక్రయాలు కొనసాగించారు.

65 లక్షల సంచులకు 3.5 లక్షలే సరఫరా

ఏలూరు జిల్లాలో ఖరీఫ్ సీజన్ ప్రారంభం నుంచి ఇంతవరకూ 65 లక్షల సంచులు అవసరం. అధికారికంగా మాత్రం జిల్లాలో అందుబాటులో ఉన్నవి 3.50 లక్షలు గోనెసంచులు మాత్రమే. వాటినే రీసైక్లింగ్‌లా నాలుగైదు పర్యాయాలు వినియోగిస్తున్నారు. వీటితో పాటు సంచుల బాధ్యతలు మిల్లర్లకు అప్పగించడంతో పాత గోనెసంచులను ఇచ్చి సంచికి రూ. 20 మేర వసూలు చేస్తున్నారు. రెండు రోజుల క్రితం మంత్రి నాదెండ్ల మనోహర్‌ను పట్టిసీమలో రైతులు సంచుల ఇబ్బందులున్నాయని విన్నవిస్తే అధికారులపై సీరియస్ అయి వెంటనే చక్కదిద్దాలని హడావుడి చేశారు. ఆ తరువాత నుంచి ఇంత వరకు పట్టించుకోలేదు. పశ్చిమగోదావరి జిల్లాలో 2.05 లక్షల ఎకరాల విస్తీర్ణంలో సాగు జరగగా 6 లక్షల టన్నులు దిగుబడి వచ్చింది. దీనికిగాను 4.10 లక్షల టన్నుల కొనుగోళ్లు చేస్తామని ప్రకటించి 85 శాతం మేర పూర్తి చేశారు. ఇక్కడ కూడా గోనెసంచుల వ్యవహారాన్ని పూర్తిగా మిల్లర్లకే వదిలేసి మిల్లుల్లో ఖాళీగా ఉన్న సంచులన్నింటినీ పౌరసరఫరాల శాఖాధికారులు సేకరించి నిరంతరం రీసైక్లింగ్ చేస్తున్నారు. ఇక్కడ కూడా 4 లక్షల గోనె సంచులు మాత్రమే అందుబాటులో ఉంచి మిల్లర్లపై వదిలేసి సంచికి కూడా ప్రత్యేక వసూలు కొనసాగించారు.

పాడి రైతుకు లేదిక భీమా

- పశు బీమా ఊసే ఎత్తని కూటమి ప్రభుత్వం
- గత ప్రభుత్వంలో పశువులకు వైఎస్సార్ బీమా పథకం
- 5,594 పశువులకు బీమా. 40 పశువులకు పరిహారం చెల్లింపు



కొమరాడలో బీమా చేసిన గేదెతో పాడి రైతు(ఫైల్)

భీమవరం(ప్రకాశం చౌక్): పాడి రైతులు ధీమాగా ఉండాలనే లక్ష్యంలో గత ప్రభుత్వం పశు బీమా పథకం అమలు చేసింది. బీమా చేసిన పశువులు ఏదైన ప్రమాదవశాత్తూ చనిపోతే రైతుకు బీమా సొమ్ము చెల్లించేవారు. అయితే కూటమి ప్రభుత్వం పశు బీమాకు మంగళం పాడింది. ఈ పథకం పేరు మార్చింది కాని అమలుకు మాత్రం చర్యలు తీసుకోవడం లేదు. దీంతో కొన్ని నెలలుగా ఏదైనా పశువు మరణిస్తే పాడి రైతుకు ఎలాంటి పరిహారం అందడం లేదు. గత ఆరు నెలలగా పశు బీమా పథకం అమలు విధి విధానాలపై పశుసంవర్ధక శాఖకు ఎలాంటి జీవో, ఆదేశాలు జారీ చేయలేదు. దాంతో ప్రమాదాలు, జబ్బు చేసి చనిపోతున్న పశువుల యాజమానులు నష్టపోతున్నారు. పశు సంవర్ధక శాఖ అధికారులకు సైతం ఏం చేయాలో తెలియడం లేదు. రూ.వేల విలువైన పశువు చనిపోతే రైతు నష్టపోతున్నాడు. గత ప్రభుత్వంలో బీమా చేసిన పశువు చనిపోతే వెంటనే సొమ్ము పాడి రైతుకు అందించేవారు. దాంతో మరో పశువును కొని ఉపాధి పొందేవారు.

50 నుంచి 80 శాతం ప్రభుత్వమే చెల్లింపు

తెల్ల రేషన్ కార్డు ఉన్న పాడి రైతులు బీమా కంపెనీకి చెల్లించాల్సిన ప్రీమియంలో 80 శాతం, ఇతర రైతులకు ప్రీమియంలో 50 శాతం సొమ్మును గత ప్రభుత్వం చెల్లించి పశువులకు బీమా చేయించేది. జిల్లాలోని ఆవులు, గేదెలు, మేకలు, గొర్రెలు మొత్తం 5,594 పశువులకు గత ప్రభుత్వంలో బీమా చేశారు. ప్రమాదవశాత్తు జిల్లాలో 46 పశువులు మరణించగా వాటిలో రూ.12 లక్షల బీమా సొమ్ము చెల్లించారు.

గత ప్రభుత్వంలో ఏ పశువుకు ఎంత

- రూ.30 వేలు విలువైన గేదె, ఆవుకు మూడేళ్ల బీమాకు ప్రీమియం రూ.1920 ఉండగా అందులో ఎస్సీ, ఎస్టీ, బీసీ, బీపీఎల్ లబ్ధిదారులు రూ.384, ఏపీఎల్ లబ్ధిదారులు రూ.960 చెల్లించగా మిగిలిన ప్రీమియం ప్రభుత్వం చెల్లించేది.
- రూ.15 వేలు విలువైన గేదె లేదా ఆవుకు మూడేళ్ల బీమాకు మొత్తం ప్రీమియం రూ.960 కాగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, బీపీఎల్ లబ్ధిదారులు రూ.192, ఏపీఎల్ లబ్ధిదారులు రూ.480 చెల్లిస్తే మిగిలిన ప్రీమియం ప్రభుత్వం చెల్లించేది.
- రూ 6 వేలు విలువైన గొర్రె, మేకకు ఏడాది ప్రీమియం రూ.180 కాగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, బీపీఎల్ లబ్ధిదారులు రూ.36 చెల్లించాలి, ఏపీఎల్ లబ్ధిదారులు రూ.90 చెల్లించాలి. మిగతా ప్రీమియం ప్రభుత్వం చెల్లించేది.
- రూ.6 వేలు విలువైన మేక, గొర్రెకు మూడేళ్ల బీమాకు మొత్తం ప్రీమియం రూ.275 చెల్లించాలి. అందులో ఎస్సీ, ఎస్టీ, బీసీ, బీపీఎల్ లబ్ధిదారులు రూ.75 చెల్లించాలి, ఏపిఎల్ లబ్ధిదారులు రూ.138 చెల్లించాలి. మిగిలిన ప్రీమియం ప్రభుత్వం చెల్లించేది.

విద్యుత్ చార్జీలు తగ్గించకపోతే ఉద్యమమే



ఏలూరు పవరుపేట రైల్వేస్టేషన్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నేతలు, కార్యకర్తలు

ఏలూరు (టూటౌన్): పెంచిన విద్యుత్ చార్జీలు, ట్రూఅప్ చార్జీలు తగ్గించకపోతే, స్మార్ట్ మీటర్లు తొలగించకపోతే మరో విద్యుత్ ఉద్యమం తప్పదని, ప్రభుత్వ పతనం తథ్యమని సీపీఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. పవర్ పేట రైల్వే స్టేషన్ వద్ద బుధవారం సీపీఎం ఆధ్వర్యంలో విద్యుత్ బిల్లుల దగ్ధం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి రవి మాట్లాడుతూ విద్యుత్ చార్జీలు పెంచబోమని వాగ్దానం చేశారని, లోకేష్ స్మార్ట్ మీటర్లు బిగింపును వ్యతిరేకించారని.. ఇప్పుడు ఏరు దాటకా బోడి మల్లన్న అనే చందంగా కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తోందని విమర్శించారు. విద్యుత్ చార్జీలు తగ్గించాలని లేదంటే విద్యుత్ పోరాటాలు సాగిస్తామని హెచ్చరించారు. జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి.ఎన్.వి.డి.ప్రసాద్, కె.శ్రీనివాస్, పి.రామకృష్ణ మాట్లాడుతూ చంద్రబాబు ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు వామపక్షాల విద్యుత్ పోరాటాన్ని, ఆ తర్వాత ఎన్నికల్లో ప్రజలు చంద్రబాబు ప్రభుత్వాన్ని ఓడించిన విషయం గుర్తు లేదా? అని ప్రశ్నించారు. స్మార్ట్ మీటర్లు బిగించడమంటే రైతుల మెడలకు ఉరితాళ్ళు బిగించడమేనన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గుడిపాటి నరసింహరావు, ఎ.శ్యామలా రాణి, కె.విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అనర్హత సాకుతో అర్హుల తొలగింపు



కొయ్యలగూడెం మండలం గంగవరంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి తానేటి వనిత

కొయ్యలగూడెం: అనర్హత సాకుతో అర్హులైన పింఛన్ దారులను ఏరివేయడం కూటమి ప్రభుత్వం ప్రారంభించిందని, ఏ ఒక్క అర్హుడికి అన్యాయం జరిగిన సహించేది లేదని మాజీ మంత్రి తానేటి వనిత ప్రభుత్వాన్ని హెచ్చరించారు. బుధవారం గంగవరంలో వైఎస్సార్‌సీపీ కన్వీనర్ కంచర్ల సత్యనారాయణ నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె పాల్గొన్నారు. రాష్ట్రంలో సుమారు మూడు లక్షలకు పైగా పెన్షనర్లను అనర్హత పేరిట తొలగించడానికి కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి అనుకూలంగా ఉన్న వారిని గుర్తించే ప్రక్రియలో కూటమి నాయకులు ఉన్నారన్న సమాచారం తమకు విశ్వసనీయంగా తెలిసిందన్నారు. ప్రభుత్వం తన బొక్కసం నింపుకునేందుకు పేదల పింఛన్లను తొలగించడం సిగ్గుమాలిన చర్యని ఎద్దేవా చేశారు. సూపర్ సిక్స్ పథకాల హామీలను అమలు చేయలేక ప్రజలకు అందే సంక్షేమ పథకాలకు కొరివి పెట్టడం కూటమి ప్రభుత్వ చేతకానితనానికి నిదర్శనమని దుయ్యబట్టారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి విష్ణు, పార్టీ నాయకులు పాముల నాగ మునిస్వామి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఫుట్‌బాల్ పోటీల్లో 'విష్ణు' విజయకేతనం



విజేతలను అభినందిస్తున్న దృశ్యం

భీమవరం: జేఎన్‌టీయూకే సెంట్రల్ జోన్ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో భీమవరం విష్ణు ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాల విద్యార్థులు ప్రథమ స్థానం సాధించారని కళాశాల ఫిజికల్ డైరెక్టర్ ఎం శ్రీ నివాసరావు తెలిపారు. ఈనెల 16, 17 తేదీల్లో నరసాపురం స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన సెంట్రల్ జోన్ పోటీల్లో తమ విద్యార్థులు సత్తా చాటి విజయకేతనం ఎగురవేశారన్నారు. ఈ సందర్భంగా బుధవారం విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ ఎం.వేణు, వైస్ ప్రిన్సిపాల్ ఎం.శ్రీలక్ష్మి, కోచ్ కె.శివప్రసాద్, పీడీ శ్రీనివాసరావు అభినందించారు.

ఉత్సాహంగా క్రీడా పోటీలు



విజేతలుగా నిలిచిన జట్లు

తాడేపల్లిగూడెం : జిల్లాలోని పాలిటెక్నిక్ రీజనల్ మీట్ క్రీడా పోటీలు బుధవారం రెండోరోజు ఉత్సాహంగా సాగాయి. వాలీబాల్‌లో సీతా పాలిటెక్నిక్ జట్టు, బాలుర బ్యాడ్మింటన్ పోటీలో సీఆర్‌రెడ్డి కళాశాల, కబడ్డీలో తణుకు ఎస్‌వీఎం కళాశాల, షటిల్ బ్యాడ్మింటన్ బాలికల పోటీలో ఏలూరు సీఆర్‌రెడ్డి జట్లు విజయం సాధించాయి. ఖోఖో ఫైనల్‌లో సీఆర్‌రెడ్డి కళాశాల విజేతగా నిలిచింది. పోటీలు గురువారంతో ముగియనున్నాయి.

23న జిల్లా అథ్లెటిక్స్ సెలెక్షన్స్

ఏలూరు రూరల్: ఏలూరు అల్లూరి సీతా రామరాజు స్టేడియంలో ఈనెల 23వ తేదీన అండర్ 14, 16 బాలబాలికల విభాగాల జిల్లా అథ్లెటిక్స్ సెలెక్షన్స్ పోటీలు జరుగుతాయని జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి దేవరపల్లి ప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు జనవరి 5వ తేదీన పశ్చిమగోదావరి జిల్లా తణుకు పట్టణంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి క్రాస్ కంట్రీ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటారన్నారు. వివరాలకు 62814-31202 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

కొనసాగుతున్న క్రికెట్ పోటీలు

దెందులూరు: వేగవరంలోని హేలాపురి ఇంజినీరింగ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాలలో జేఎన్‌టీయూ యూనివర్సిటీ స్థాయి బాలుర క్రికెట్ పోటీలు బుధవారం ఉత్సాహంగా సాగినట్లు కళాశాల ప్రిన్సిపాల్ లావణ్య తెలిపారు. ఏలూరు ఇంజనీరింగ్ కళాశాల, తాడేపల్లిగూడెం శశి ఇంజనీరింగ్ కళాశాల మధ్య జరిగిన పోటీలో ఏలూరు ఇంజనీరింగ్ విజయం సాధించిందని చెప్పారు. అలాగే భీమవరం ఎస్‌ఆర్‌కే కళాశాల, డీఎన్నార్ కళాశాల మధ్య జరిగిన పోటీలో ఎస్‌ఆర్‌కే కళాశాల విజయం సాధించిందన్నారు.

నాటు పడవలపై వేట



నరసాపురం గోదావరి తీరంలో చెక్కనావలు సందడి చేస్తున్నాయి. ప్రస్తుతం అటు సముద్రంలోను, ఇటు గోదావరిలోను చేపలు అధికంగా పడే సీజన్. దీంతో మత్స్యకారులు వేటలో బిజీగా ఉన్నారు. చెక్కనావలు సిద్ధం చేసుకుని అందులో వలలు సర్దుకుని మత్స్యకారులు విరామం లేకుండా వేట సాగిస్తున్నారు. గోదావరిలో వలకట్లు కూడా ముమ్మరంగా కడుతున్నారు.

– నరసాపురం

నామ సంకీర్తనం మోక్షదాయకం



ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా జంగారెడ్డిగూడెంలోని గోకుల తిరుమల పారిజాతగిరి వేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం తిరుప్పావై మూడవ పాశురం అర్థాన్ని ప్రధాన అర్చకులు నల్లూరు రవికుమారాచార్యులు తెలియజేశారు. భగవంతుని నామ సంకీర్తనే పరమాత్ముని అనుగ్రహం పొందేందుకు సులభమైన మార్గమని వివరించారు. ప్రవచనం అనంతరం తీర్థ ప్రసాద గోష్టి నిర్వహించారు.

– జంగారెడ్డిగూడెం

బుల్లి వానరంపై ఔదార్యం



ప్రమాదానికి గురైన పండుకోతి జాతికి చెందిన పిల్లకు వైద్య చికిత్స నిర్వహించి ప్రాణాలు కాపాడారు. పరింపూడికి చెందిన రైతు ఎండేటి రోశయ్య తన పొలంకి వెళ్తున్న సమయంలో ఈ కోతి పిల్లను గమనించి పశు వైద్యశాలకు తీసుకువెళ్లగా పశు వైద్య శాఖ అధికారి డాక్టర్ బీఆర్ శ్రీనివాస్ శస్త్రచికిత్స నిర్వహించారు. ఎడమ కాలు తొంటి ఎముక విరిగిపోవడంతో తొడ భాగం వరకు కాలుని తొలగించి చికిత్స అందించారు. వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ పృథ్వి రెడ్డి, (తణుకు), సిబ్బంది పాల్గొన్నారు.

– కొయ్యలగూడెం

వేధిస్తున్న హెచ్‌ఐవీ కిట్ల కొరత

- మూడో కిట్ కోసం ఎదురుచూపులు
- స్టాక్ లేకపోవడంతో ఒక సెంటర్ నుంచి మరో సెంటర్‌కు సర్దుబాట్లు
- ఉమ్మడి పశ్చిమలోని సర్కారు దవాఖానాల్లో నెలకొన్న దుస్థితి



తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలోని ఐసీటీసీ విభాగ గది

తణుకు అర్బన్: సర్కారు దవాఖానాల్లో హెచ్‌ఐవీ పాజిటివ్ నిర్ధారణ చేసే కిట్స్ కొరతతో పరీక్షల కోసం రోగులు వేచిచూడాల్సిన దుస్థితి ఏర్పడింది. హెచ్‌ఐవీ నిర్ధారణకు మూడు రకాల కిట్‌లు వినియోగించాల్సి ఉంటుంది. హెచ్‌ఐవీ అనే అనుమానంతోపాటు వివిధ సర్జరీలు, గర్భిణుల కోసం సర్కారు ఆస్పత్రుల్లో నిత్యం పరీక్షలు నిర్వహిస్తుంటారు. ఇందులో భాగంగా మొదటి కిట్‌లో పాజిటివ్ వచ్చిన వారికి మిగిలిన రెండు కిట్‌లతో పరీక్ష చేసిన తరువాతే పాజిటివ్‌గా నిర్ధారణకు వస్తారు. మొదటి కిట్‌లో నెగిటివ్‌గా వచ్చినవారికి తదుపరి కిట్‌లతో పరీక్షలు నిర్వహించాల్సిన అవసరంలేదు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని సర్కారు దవాఖానాల్లో ఈ పరీక్షలు నిర్వహిస్తున్న ఐసీటీసీ సెంటర్లలో అరకొరగానే మూడో కిట్ ఉండడంతో పరీక్షలు నిర్వహించడంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ముఖ్యంగా మూడో కిట్ అరకొరగా ఉండడంతో ఆయా ఆస్పత్రుల్లోని ఐసీటీసీ సెంటర్‌లలో గర్భిణుల కోసం ఒకటి, రెండు దాచుకోవాల్సి వస్తుందని వైద్యవర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలో ఇటీవల నిర్వహించిన పరీక్షల్లో ఇద్దరికి రెండు కిట్‌లలోను పాజిటివ్ రాగా సెంటర్‌లో ఒక్క కిట్ మాత్రమే అందుబాటులో ఉంది. ఆ ఒక్కటి కూడా అత్యవసర సమయంలో గర్భిణులకు ఉపయోగించేందుకు అందుబాటులో ఉంచాల్సిన అవసరం ఉండడంతో ప్రస్తుతం ఆ ఇద్దరు వ్యక్తులు మూడో కిట్ పరీక్ష కోసం వెయిటింగ్‌లో ఉండాల్సి వచ్చింది. తణుకు సెంటర్‌లో నెలకు సుమారుగా 15 నుంచి 20 వరకు హెచ్‌ఐవీ పాజిటివ్ కేసులు వస్తున్నాయని వైద్యాధికారులు చెబుతున్నారు.

ఇబ్బందులు తలెత్తకుండా చూస్తున్నాం

హెచ్‌ఐవీ మూడో కిట్ కొరత ఉన్నప్పటికీ ఎక్కడా ఇబ్బంది రాకుండా చూస్తున్నాం. రెండు కిట్‌లలోను పాజిటివ్ వచ్చిన వారికి ఎటువంటి ఇబ్బంది లేకుండా మూడో కిట్‌ను అందుబాటులోకి తీసుకువచ్చి వినియోగిస్తున్నాం.

– డాక్టర్ బి.భానునాయక్, డీఎల్‌ఏటీఓ, భీమవరం

ఉమ్మడి జిల్లాలో..

ఉమ్మడి పశ్చిమ జిల్లాలోని ఏలూరు, తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రులతోపాటు కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోని ఐసీటీసీ సెంటర్‌లలో హెచ్‌ఐవీ నిర్ధారణ పరీక్షలు నిత్యం జరుగుతుంటాయి. రాష్ట్ర వ్యాప్తంగా గత నెల రోజులుగా మూడవ కిట్ సరఫరా పూర్తిస్థాయిలో లేకపోవడంతో ఉన్న అరకొర కిట్లను ఒక సెంటర్ నుంచి మరొక సెంటర్‌కు పంపించే పరిస్థితి తలెత్తింది. ఉమ్మడి జిల్లాకు సంబంధించి నెలకు సుమారుగా మొదటి కిట్ వెయ్యి వరకు, రెండు, మూడు కిట్‌లు కనీసం 300 చొప్పున నిల్వలు ఉండాల్సిన అవసరం ఉంది. ఈ మేరకు మూడో కిట్ సరఫరా లేకపోవడంతో జిల్లాలోని కొన్ని సెంటర్‌లలో రెండు కిట్‌లలోను పాజిటివ్ వచ్చి మూడో కిట్ కోసం వెయిటింగ్‌లో ఉండాల్సిన పరిస్థితి. ఈ నెల 16వ తేదీనాటికి మూడో కిట్ నిల్వలు తణుకులో 1, పాలకొల్లు 2, తాడేపల్లిగూడెం 2, జంగారెడ్డిగూడెం 4, నరసాపురం 5, ఆకివీడు 8, ఏలూరు 8, చింతలపూడి 8, భీమవరం 12 ఉన్నట్లుగా సమాచారం.

గత ప్రభుత్వ హయాంలో..

గత జగన్ ప్రభుత్వ హయాంలో ఐదేళ్లపాటు వైద్యానికి ఇచ్చిన ప్రాధాన్యతపరంగా హెచ్‌ఐవీ కిట్ల కొరత అంటూ లేదని, ఎప్పుడూ పూర్తిస్థాయి సరఫరా ఉండేదని వైద్యవర్గాలే చెబుతున్నాయి. గతంలో ప్రతి సెంటర్‌లోను 20కిపైగా మూడో కిట్ నిల్వలు అందుబాటులో ఉండేవని తెలుస్తోంది. కానీ నేడు మూడో కిట్‌ను చాలా పొదుపుగా వాడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

నిధుల మంజూరుకు మంత్రి వినతి



రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రికి వినతిపత్రం అందిస్తున్న కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ

భీమవరం : పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్న 100 పడకల ఆసుపత్రి స్థలంలో 50 పడకల క్రిటికల్ కేర్ బ్లాక్ నిర్మాణానికి రూ.30 కోట్లు మంజూరు చేయాలని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమశాఖ సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ కోరారు. ఈమేరకు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి వై సత్యకుమార్‌కు వినతిపత్రం అందించారు. జిల్లాల పునర్వ్యవస్థీకరణలో భాగంగా వైఎస్సార్ సీపీ హయాంలో భీమవరంలోని 50 పడకల ఆసుపత్రిని 100 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేశారని, అత్యవసర రోగులకు వైద్యం అందించేందుకు క్రిటికల్ కేర్ బ్లాక్ అవసరమున్న నేపథ్యంలో నిధులు మంజూరు చేయాలని ఆరోగ్య శాఖా మంత్రిని కోరినట్లు ఆయన చెప్పారు.

కోడ్ ముగిసినా తొలగని ముసుగులు



విస్సాకోడేరులో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి తొలగించని ముసుగు

భీమవరం: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు ముగిసి పది రోజులు గడిచినా నేటికీ ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకుల విగ్రహాలకు వేసిన ముసుగులు తొలగించలేదు. విగ్రహాలకు ముసుగు వేయడంలో ఉన్న ఆసక్తి వాటిని తొలగించడంలో అధికారులకు కన్పించడం లేదనే విమర్శలు విన్పిస్తున్నాయి. ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు నవంబర్ 11వ తేదీన నోటిఫికేషన్ ఇవ్వడంతో ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. ఎన్నికల నిబంధనల మేరకు దివంగత ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు వేశారు. అలాగే పట్టణాలు, గ్రామాల్లో ఏర్పాటుచేసిన పార్టీల జెండా దిమ్మలు, ఫ్లెక్సీలకు బరకాలు కప్పి కన్పించకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. ఈనెల 5వ తేదీన పోలింగ్, 9వ తేదీన ఓట్లు లెక్కింపు జరగ్గా పీడీఎఫ్ అభ్యర్థి బొర్రా గోపీమూర్తి విజేతగా ప్రకటించారు. గోపిమూర్తి ఎమ్మెల్సీగా ప్రమాణస్వీకారం చేశారు. అయితే ఎన్నికల కోడ్ ముగిసిన అనంతరం నిబంధనలకు అనుగుణంగా ప్రజాప్రతినిధుల విగ్రహాలకు, పార్టీ జెండాలకు వేసిన ముసుగులు తొలగించాల్సి ఉన్నా ఆ దిశగా అధికారులు మాత్రం శ్రద్ధ చూపడం లేదు.

అకడమిక్ భవనం.. నిర్మాణంలో జాప్యం

- పీజీ కేంద్రంలో రూ.5 కోట్లతో నిర్మాణం
- వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో 95 శాతం పనులు పూర్తి
- గత ఆరు నెలలుగా మిగిలిన పనులు నత్తనడకన సాగుతున్న వైనం



నూజివీడు పీజీ కేంద్రంలో తుది దశకు చేరిన అకడమిక్ భవనం

నూజివీడు: కృష్ణా యూనివర్సిటీ పరిధిలోని పట్టణంలో ఉన్న ఎమ్మార్ అప్పారావు కాలేజీ ఆఫ్ పోస్టు గ్రాడ్యుయేషన్ స్టడీస్ (పీజీ కేంద్రం) ఆవరణలో రూ.5 కోట్లతో నిర్మిస్తున్న అకడమిక్ భవన నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. పీజీ కేంద్రంలో చదువుతున్న విద్యార్థుల సౌకర్యార్థం, నూతన కోర్సులను తీసుకువచ్చేందుకు అందుబాటులో తరగతి గదులు ఉండాలనే లక్ష్యంతో మాజీ ఎమ్మెల్యే మేకా ప్రతాప్ అప్పారావు కృషితో అకడమిక్ భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. దీనిలో భాగంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అప్పటి విద్యాశాఖ మంత్రి ఆదిమూలం సురేష్ 2021 ఆగస్టు 11న శంకుస్థాపన చేశారు. అప్పటి నుంచి జీ+3 భవన నిర్మాణ పనులు ప్రారంభమై ముమ్మరంగా సాగాయి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కాలంలో 95 శాతం పనులు పూర్తయ్యాయి. ఈ భవనంలో తరగతి గదులకు, ల్యాబ్‌లకు కలిపి మొత్తం 40 గదులకు పైగానే ఉన్నాయి. అయితే గత ఆరు నెలలుగా మిగిలిన ఐదు శాతం పనులు పూర్తిచేయడంలో తీవ్ర జాప్యం నెలకొంది.

నూతన కోర్సులు తెచ్చేందుకు వీలుగా...

తరగతి గదులు అందుబాటులో ఉంటే అవసరమైతే నూతన కోర్సులు తీసుకురావచ్చనే సదాశయంతో అకడమిక్ భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ప్రస్తుతం ఈ పీజీ కేంద్రంలో అప్లైడ్ మాథ్స్, ఆర్గానిక్ కెమిస్ట్రీ, ఫిజిక్స్, అనలైటికల్ కెమిస్ట్రీ, స్టాటిస్టిక్స్, ఎంబీఏ, ఎంకామ్ తదితర కోర్సులు అందుబాటులో ఉన్నాయి. వీటికి తోడు జనరల్ మాథ్స్, ఎంఈ ఇంగ్లీష్, ఎంఏ జర్నలిజం తదితర మరిన్ని కోర్సులు తీసుకువచ్చేందుకు వీలుగా భవన నిర్మాణాన్ని చేపట్టారు. తరగతి గదులకు తోడు లేబోరేటరీలకు కూడా గదులను అన్ని వసతులతో నిర్మించారు. ఈ భవన నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేసి ప్రారంభించి అందుబాటులోకి తేవాల్సి ఉండగా ఆ దిశగా పనులు సాగడం లేదు. ఇప్పటికైనా పెండింగ్ పనులు పూర్తి చేసి భవనాన్ని ప్రారంభించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

డీటీ, వీఆర్వోలపై చర్యలు తీసుకోవాలి



కేఆర్‌పురం ఐటీడీఏ వద్ద ఏఎస్‌పీ ఆధ్వర్యంలో గిరిజనుల ధర్నా

బుట్టాయగూడెం: జీలుగుమిల్లి మండలంలో ఆదివాసీ భూములకు సంబంధించి 1బి లను నిలుపుదల చేసిన డిప్యూటీ తహసీల్దార్ సందీప్ గౌడ్‌ను, తప్పుడు మ్యుటేషన్ చేసిన వీఆర్‌ఓ బుల్లెబ్బాయిని ఉద్యోగం నుంచి తొలగించి, అరెస్ట్ చేయాలని కోరుతూ ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో గిరిజనులు బుధవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కాకి మధు మాట్లాడుతూ అన్ని హక్కులు కలిగి ఉన్న ఆదివాసీల భూములకు సంబంధించి కాసులకు కక్కుర్తిపడి నకిలీ పాస్ పుస్తకాలు తయారు చేసి అధికారాన్ని దుర్వినియోగం చేశారని ఆరోపించారు. డీటీ, వీఆర్‌ఓలపై కఠిన చర్యలు తీసుకోకపోతే తమ సంఘం ఆధ్వర్యంలో ఉద్యమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం వినతిపత్రాన్ని ఏపీఓ పీవీఎస్ నాయుడుకు అందజేశారు. కార్యక్రమంలో ఏఎస్‌పీ నాయకులు పొట్టా కామరాజు, పండు నాగేంద్ర, రవ్వా బసవరాజు, తదితరులు పాల్గొన్నారు.

బంగారం రికవరీ కోసం ఐదు బృందాలు

తాడేపల్లిగూడెం: జ్యూయలరీ వ్యాపారులకు టోకరా వేసిన నిందితుడిని వెదికేందుకు పోలీసులు ఐదు బృందాలుగా ఏర్పడి జల్లెడ పడుతున్నట్లు తెలుస్తోంది. బంగారు వస్తువుల తయారీ కోసం వివిధ జ్యూయలరీ వ్యాపారుల నుంచి పెద్ద మొత్తంలో బంగారం, వెండి, వజ్రాలు తీసుకెళ్లి తాడేపల్లిగూడెంలోని ఓ బంగారం వ్యాపారి ఉడాయించిన సంగతి తెలిసిందే. అతడిని పట్టుకునేందుకు పోలీసు బృందాలు ఏలూరు, హైదరాబాద్, విజయవాడ వంటి ప్రాంతాలకు బృందాలుగా వెళ్లి నిందితుని బంధువుల ఇళ్లల్లో సోదాలు చేసినట్టు సమాచారం. ఈ సోదాల్లో పెద్ద మొత్తంలో బంగారు ఆభరణాలు, వెండి దొరికినట్టుగా ప్రచారం సాగుతోంది. అనధికారిక అంచనా ప్రకారం నాలుగు కిలోల బంగారు ఆభరణాలు, 75 కిలోల వెండి పోలీసులు స్వాధీనం చేసుకున్నట్టు తెలుస్తోంది. నిందితుడి కోసం తాడేపల్లిగూడెం డీఎస్పీ, పట్టణ సీఐ, గూడెం పట్టణ, పెంటపాడు, తణుకు ఎస్సైల ఆధ్వర్యంలో పోలీసులు వేట కొనసాగిస్తున్నట్టుగా చెబుతున్నారు. ప్రస్తుతానికి ఈ ఘటనలో బాధితుల సంఖ్య 12 మంది అని చెబుతున్నా, ఆ సంఖ్య భారీగా ఉన్నట్టు తెలిసింది. భీమవరానికి చెందిన ముగ్గురు వ్యాపారులు కూడా గూడెం వ్యాపారి చేతిలో మోసపోయినట్టు సమాచారం. పోలీసులు ఈ కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకొని నిందితుని పట్టుకునేందుకు గాలింపు చర్యలు చేపట్టారు.

రాగివైరు చోరీ చేస్తున్న ముఠా అరెస్ట్

- రూ.6,39,750 విలువైన చోరీ సొత్తు స్వాధీనం
- నలుగురు నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు



పోలీసులు స్వాధీనం చేసుకున్న రాగి వైరు

ఏలూరు టౌన్: విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లలో రాగి వైరును చోరీ చేస్తున్న ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. ఏలూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో బుధవారం ఏలూరు జిల్లా ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివ కిషోర్ వివరాలు వెల్లడించారు. గత కొన్ని రోజులుగా జిల్లాలో ద్వారకాతిరుమల, భీమడోలు, లక్కవరం, తడికలపూడి, టి.నరసాపురం ప్రాంతాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు పగులగొట్టి అందులో రాగివైరును కొందరు దొంగతనం చేస్తున్నారు. దీనిపై ఏలూరు డీఎస్పీ శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో భీమడోలు సీఐ యూజే విల్సన్ పోలీస్ సిబ్బందితో దర్యాప్తు చేపట్టగా 41 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లలోని రాగివైరును చోరీ చేసినట్లు గుర్తించారు. ఈ చోరీలకు పాల్పడిన ద్వారకాతిరుమల మండలం జీ. కొత్తపల్లి గ్రామానికి చెందిన మానుకొండ వెంకట్రావు, జంగారెడ్డిగూడెనికి చెందిన ముగ్గల్ల దుర్గాప్రసాద్, ముగ్గల్ల శ్రీనివాసరావు, ఉక్కుర్తి వెంకటేశ్వరరావును పోలీసులు అరెస్టు చేశారు. వారిని విచారించగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు పగులగొట్టి దానిలోని రాగి వైరులను పాత ఇనుప సామాను దుకాణాల్లో విక్రయిస్తున్నట్లు తెలిసింది. నిబంధనలకు విరుద్ధంగా రాగి వైరు కొనుగోలు చేస్తున్న ఉక్కుర్తి వెంకటేశ్వరరావు నుంచి సుమారు 539 కిలోల కరిగించిన రాగి వైర్ల దిమ్మలు, 100 కిలోల రాగి తీగను స్వాధీనం చేసుకున్నారు. చోరీకి వినియోగించే ఇనుప కొక్కెం తొడిగిన ప్లాస్టిక్ పైపు, రెండు ఇనుప రెంచులు, రెండు మోటారు సైకిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. చోరీ సొత్తు రూ.6,39,750 ఉంటుందని తెలిపారు. ఈ కేసును ఛేదించిన భీమడోలు సీఐ యూజే విల్సన్, ద్వారకాతిరుమల ఎస్సై టీ సుధీర్ బాబు, పోలీస్ సిబ్బంది ఎస్ శ్రీనివాస్, ఎం. వెంకటేశ్వరరావు, ఎస్.మురళీకృష్ణ, వీజే ప్రకాష్‌బాబును ఎస్పీ అభినందించారు. ఈ సమావేశంలో ఏలూరు జిల్లా అదనపు ఎస్పీ నక్కా సూర్యచంద్రరావు, ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్ ఉన్నారు.

ఏలూరు జీజీహెచ్‌లో అవినీతిపై విచారణ

ఏలూరు టౌన్: ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో కాన్పు కోసం చేరిన ఒక మహిళ బంధువుల నుంచి కొందరు ఉద్యోగులు సొమ్ములను డిమాండ్ చేసి వసూలు చేశారని బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బుధవారం ఆసుపత్రి అధికారులు విచారణ నిర్వహించారు. పెదపాడు మండలం కొత్తూరు గ్రామానికి చెందిన ఒక మహిళ ప్రసవం కోసం ఈనెల 12వ తేదీన ఏలూరు సర్వజన ఆసుపత్రిలోని తల్లి -బిడ్డల విభాగంలో చేరింది. 13వ తేదీన ఆమె బంధువు వచ్చారు. ఆసుపత్రిలోని కొందరు ఉద్యోగులు లంచాల కోసం డిమాండ్ చేసి వసూలు చేశారని ఆమె ఒక వీడియో తీసి ఉన్నతాధికారులకు పంపించారు. దీనిపై కలెక్టర్ వెట్రిసెల్వి వెంటనే విచారణకు ఆదేశించారు. ఏలూరు అర్బన్ తహసీల్దార్ శేషగిరి అదే రోజు ఆసుపత్రికి వచ్చి ప్రాథమిక విచారణ చేశారు. మరోవైపు ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎంఎస్ రాజు ఈ ఘటనపై పూర్తిస్థాయి విచారణ కోసం ఆసుపత్రిలోని ఎంసీహెచ్ ఇన్‌చార్జి వైద్యురాలు డాక్టర్ వి లావణ్య, డెర్మటాలజిస్ట్ డాక్టర్ త్యాగి, నర్సింగ్ సూపరింటెండెంట్ విజయలక్ష్మిలతో విచారణ బృందంగా నియమించారు. వీరు బుధవారం ఆరోపణలు ఎదుర్కొంటున్న ఉద్యోగులందరినీ పిలిపించి వారి వాంగ్మూలాన్ని నమోదు చేశారు. మరోవైపు ఫిర్యాదురాలి వాంగ్మూలాన్ని కూడా నమోదు చేశారు. నివేదికను మెడికల్ సూపరింటెండెంట్‌కు అందించనున్నారు. అనంతరం ఆ నివేదిక ఏలూరు అర్బన్ తహసీల్దార్ శేషగిరి ద్వారా జిల్లా కలెక్టర్‌కు అందనున్నట్లు సమాచారం.

క్లుప్తంగా

దుర్గామాతకు కుంకుమ పూజ



బొంతువారిపాలెంలో అమ్మవారికి పూజ చేస్తున్న భవానీలు

అత్తిలి: అత్తిలి శివారు బొంతువారిపాలెం శ్రీవరసిద్ధి వినాయక స్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన భవానీ పీఠంలో బుధవారం అమ్మవారికి విశేష పూజలు చేశారు. భవానీ భక్తులచే అర్చకులు అయిలూరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో దుర్గామాతకు అభిషేకాలు, కుంకుమ పూజలు నిర్వహించారు. ఆంజనేయ స్వామివారికి తమలపాకులు, గంధ సింధూరం పూజలు చేశారు. కార్యక్రమంలో గురు భవాని కేతా నాగేశ్వరరావు, భవానీ భక్తులు పాల్గొన్నారు.

గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు



కొండ్రుప్రోలు సదస్సులో మాట్లాడుతున్న తహసీల్దార్ సునీల్ కుమార్

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని కొండ్రుప్రోలు, ఎల్ అగ్రహారం గ్రామాల్లో బుధవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. కొండ్రుప్రోలులో 20, ఎల్ అగ్రహారంలో 17 అర్జీలు వచ్చాయని తహసీల్దార్ ఎం సునీల్‌కుమార్ తెలిపారు. రైతులు, ప్రజలు రెవెన్యూ సదస్సులను వినియోగించుకోవాలని కోరారు. నీటి సంఘం అధ్యక్షుడు జానా బాల బాలాజీ, కూటమి నాయకులు బాబూరావు, రెవెన్యూ, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన



కూచిపూడి నృత్య ప్రదర్శన దృశ్యాలు

అత్తిలి: శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి స్వామివారి కళావేదికపై కూచిపూడి జానపద నృత్య ప్రదర్శన ఏర్పాటు చేశారు. అత్తిలికి చెందిన గాయిత్రి కళాకేంద్రం వారిచే నిర్వహించిన ఈ నృత్య ప్రదర్శన సభికులను అలరించింది. అనంతరం సూర్య ఈవెంట్స్ తణుకు వారిచే డ్యాన్స్ హంగామా కార్యక్రమం ఏర్పాటుచేశారు.

ఫుడ్ ఇన్‌స్పెక్టర్ల సోదాలు



పండ్ల మార్కెట్‌లో ఫుడ్ ఇన్‌స్పెక్టర్ల సోదాలు

తాడేపల్లిగూడెం : పట్టణంలోని పండ్ల మార్కెట్‌లో ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు బుధవారం సోదాలు నిర్వహించారు. పండ్లను కార్బైడ్‌తో మగ్గిస్తున్నారా లేక సాంప్రదాయ పద్ధతుల్లో ముగ్గబెడుతున్నారా అనే విషయాలపై ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ఎస్ఆర్ రెడ్డి బృందం ఆరా తీసింది. అధికారులు వచ్చేసరికి మార్కెట్‌లో ఉన్న దుకాణాల్లో సరుకు కనిపించలేదు. అక్కడక్కడ అరటిపండ్ల గెలలు తప్ప ఇంకేమి లేక పోవడంతో వాటినే పరిశీలించి అధికారులు వెనుతిరిగి వెళ్లారు.

అభివృద్ధిలో భాగస్వాములు కావాలి



మాట్లాడుతున్న ఎంపీపీ నాగేశ్వరరావు

అత్తిలి: గ్రామ పంచాయతీల అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎంపీపీ సుంకర నాగేశ్వరరావు అన్నారు. సుస్థిర అభి వృద్ధి లక్ష్యాలపై రెండో విడత రెండు రోజుల శిక్షణ బుధవారం అత్తిలి మండలపరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లు, పంచాయితీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి ప్రారంభించారు. అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలు 8 థీమ్స్ లక్ష్యాలు, ప్రజారోగ్య లక్ష్యాలు, ఎల్ఎస్‌డీఎస్‌కు సంబంధించి అవగాహన కల్పించారు. ఎంపీడీఓ పి.శామ్యూల్, ఈఓఆర్డీ ఎం శ్రీనివాసరావు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

వరి కోతలు వాయిదా వేసుకోండి

అత్తిలి: అల్పపీడన ప్రభావంతో వాతావరణ మార్పుల కారణంగా రెండురోజుల పాటు వరి కోతలను వాయిదా వేసుకోవాలని తహసీల్దార్ దశిక వంశీ రైతులకు బుధవారం సూచించారు. కల్లాల్లో ఉన్న ధాన్యాన్ని తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రైతు సేవా కేంద్రంలో తేమశాతానికి అనుగుణంగా అమ్ముకోవడానికి వీలు కల్పించామని తెలిపారు. రైతులు దళారులకు ధాన్యం అమ్మి మోసపోవద్దని సూచించారు.

యాగర్లపల్లి.. సమస్యల లొల్లి

- క్షీణించిన పారిశుద్ధ్యం
- విజృంభిస్తున్న దోమలు
- పైప్‌లైన్ లీకేజీలతో తాగునీరు కలుషితం
- ప్రజలకు అవస్థలు



యాగర్లపల్లిలోని ఓ ప్రాంతంలో డ్రెయినేజీ దుస్థితి

తాడేపల్లిగూడెం (టీఓసీ): తాడేపల్లిగూడెం టూటౌన్ 24వ వార్డులోని యాగర్లపల్లిలో సమస్యలు తిష్ట వేశాయి. అస్తవ్యస్తంగా మారిన డ్రెయినేజీలు, శిథిల కల్వర్టులు, ధ్వంసమైన రోడ్లు, ఖాళీ స్థలాలు, ఇళ్ల మధ్యలోనే చెత్తా చెదారాల దర్శనం, నీటి కాలుష్యం, పందులు, కుక్కల బెడద, విష కీటకాల బెడద ఇలా అనేక సమస్యలు పరిష్కారానికి నోచుకోవడంలేదు. ఈ నేపథ్యంలో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు.

పన్నులు కడుతున్నా.. పరిష్కారం కాని సమస్యలు

యాగర్లపల్లి జనాభా 5 వేలకు పైమాటే. ఇక్కడ 2,700 ఓటింగ్ ఉంది. యాగర్లపల్లి పరిధిలో వెంకట సుబ్బయ్య కాలనీ, ఎస్సీ హాస్టల్ రోడ్డు, అర్బన్ హెల్త్ సెంటర్ రోడ్డు, ప్రాథమిక పాఠశాల రోడ్డు, సాయికృష్ణ వీధి, ఆచంట వారి వీధి, ఇలా పలు అంతర్గత రహదారులు ఉన్నాయి. అన్ని రకాల పన్నులు పురపాలక సంఘానికి కడుతున్నా స్థానిక సమస్యలు మాత్రం పరిష్కారం కావడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

చెత్త కుప్పలు.. మురుగు కూపాలు

24వ వార్డులోని అనేక ప్రాంతాల్లో డ్రెయిన్లలో మురుగునీరు ముందుకు కదలడంలేదు. డ్రెయిన్లపై కల్వర్టులు నిర్మించాల్సి ఉంది. ఖాళీ స్థలాల్లో మురుగు నీరు చేరి దోమల ఉత్పత్తి కేంద్రాలుగా మారాయి. దోమల బెడదతో ప్రజలు రాత్రి సమయంలో కంటిమీద కునుకులేకుండా గడపాల్సి వస్తుంది. దోమలను అరికట్టేందుకు చక్రాలు, అగరొత్తులు, లిక్విడ్స్ కోసం ఒక్కో కుటుంబం నెలకు రూ.200 చొప్పున ఖర్చు చేయాల్సి వస్తుందని వాపోతున్నారు. పలు ప్రాంతాల్లో దర్శనమిస్తున్న చెత్త కుప్పల్లో పందులు స్వైరవిహారం చేస్తున్నాయి. పలు చోట్లు స్ట్రీట్ లైట్లు వెలగడంలేదు. రాత్రి సమయంలో విష కీటకాలు దర్శనమిస్తుండడంతో ఎప్పుడు ఏమి జరుగుతుందో అని ప్రజలు భయాందోళన చెందుతున్నారు.

పైప్‌లైన్‌కు లీకేజీలు

యాగర్లపల్లిలో అనేక ప్రాంతాల్లో మంచినీటి సమస్య వేధిస్తుంది. యాగర్లపల్లిలో ఓవర్ హెడ్ ట్యాంక్ ఉన్నప్పటికీ, అనేక ప్రాంతాల్లో పైప్‌లైన్లలో లీకేజీల కారణంగా నీరు రంగు మారుతుంది. దుర్వాసన వెదజల్లుతుంది. అప్పుడప్పుడు పురుగులు కూడా వస్తున్నాయి. ఈ సమస్యలను పురపాలక సంఘం, సచివాలయ సెక్రటరీల దృష్టికి తీసుకెళుతున్నా పరిష్కారం అంతంత మాత్రమే అని ప్రజలు వాపోతున్నారు.

శుద్ధినీరు అందించాలి



యాగర్లపల్లిలో దోమల బెడద అధికంగా ఉంది. డ్రెయినేజీలు, ఖాళీ స్థలాలు అస్తవ్యస్తంగా ఉండటంతోపాటు దుర్గంధం వెదజల్లుతుంది. అంతర్గత రహదారులు నిర్మించాల్సి ఉంది. పైపులైన్లలో ఉన్న లీకేజీలను అరికట్టి, అందరికీ పరిశుభ్రమైన నీటిని అందించాలి. ఆయా సమస్యలను పరిష్కరించాలి. – కె.శ్రీను, యాగర్లపల్లి



ఆచంట వారి వీధిలో రోడ్డుపైనే వ్యర్థ నీరు, పందులు



కుళాయి నుంచి వస్తున్న మురుగు నీరు



డ్రెయినేజీలో కదలని మురుగు

మైనారిటీ హక్కుల దినోత్సవం



సమావేశంలో మాట్లాడుతున్న మునిస్వామి

తణుకు అర్బన్: మైనారిటీ హక్కుల దినోత్సవం సందర్భంగా బుధవారం మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, నాలుగో అదనపు జిల్లా జడ్జి డి.సత్యవతి ఆదేశాల మేరకు తణుకు హనీపేట్ మసీదులో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల లీగల్ సెల్ న్యాయవాదులు మైనారిటీల హక్కులు, ఆస్తి కొనుగోలు విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రామిసరి నోటుపై డబ్బులు తీసుకునే సందర్భాల్లో జాగ్రత్తలు, రాజ్యాంగం కల్పించిన హక్కులను వివరించారు. మైనారిటీలకు ఎటువంటి లీగల్ సమస్యలు ఉన్నా ఉచిత న్యాయ సహాయం కోసం మండల న్యాయ సేవల కమిటీని సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు కె.వెంకటేశ్వర్లు, కామన మునిస్వామి, షేక్ మోతి, కోలా దుర్గాభవాని, టి.సత్యనారాయణ రాజు, షేక్ అహ్మద్ అలీ ఖాన్ బాజీ, ధనుంజయ్, మసీదు ప్రెసిడెంట్ రహిముద్దీన్, మైనారిటీలు పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య పరీక్షలు

పెంటపాడు: అలంపురం వెంకట రమణ చారిటీ ఆసుపత్రిలో గురువారం ఎముకలు, కీళ్లు, జనరల్ సర్జన్, డెర్మటాలజీ, పల్మనాలజీ, ఈఎన్‌టీ వైద్య పరీక్షలు ఉచితంగా నిర్వహించనున్నట్టు ట్రస్టు చైర్మన్ కొలనువాడ పెదకృష్ణంరాజు ఒక ప్రకటనలో తెలిపారు. స్కానింగ్, గుండెకు సంబంధించిన 2డి ఈకో తదితర పరీక్షలు ఉచితంగా చేస్తామన్నారు. దూరప్రాంతాల నుంచి వచ్చే రోగులకు భోజన సదుపాయం కల్పించామని, పరిసర గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

క్రీస్తు బోధనలు అనుసరణీయం

పెంటపాడు: స్థానిక మండల పరిషత్ ఓపెన్ ఆడిటోరియంలో బుధవారం పెంటపాడు మండల ఎంప్లాయిస్ ఐక్యక్రిస్మస్ ఘనంగా నిర్వహించారు. ఎంపీడీఓ బాలాజీల అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో తణుకుకు చెందిన బ్రదర్ ప్రతాప్ దేవుని వాక్యం వివరించారు. క్రీస్తుబోధనలు ప్రతి ఒక్కరికీ అనుసరణీయం అన్నారు. క్రీస్తు చూపిన శాంతి, సహన మార్గంలో ఉద్యోగులు పయనించాలన్నారు. అనంతరం ప్రేమవిందు స్వీకరించారు. ఒకరికొకరు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కేక్ కట్ చేశారు. కొవ్వొత్తులు వెలిగించి కీర్తనలు ఆలపించారు. తహసీల్దార్ ఏడిద శ్రీనివాస్, మండల కార్యాలయ సూపరింటెండెంట్ టీవీ సత్యనారాయణ, ఏఓ పార్థసారధి, ఎంఈఓలు టీవీ రామకృష్ణ, శ్రీనివాస్, మండల విశ్రాంత ఉద్యోగులు, అన్ని శాఖల ఉద్యోగులు హాజరయ్యారు.

ప్రేమ, సేవాభావం కలిగి ఉండాలి



అత్తిలిలో విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన

అత్తిలి: స్థానిక మదర్ మెర్సిల్లా స్కూల్‌లో క్రిస్మస్‌ను బుధవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిలుగా హాజరైన ఎంఈఓలు ఎస్ రమేష్, ఎంపీఎల్‌కే ప్రసాద్‌లు మాట్లాడుతూ విద్యార్థులు ప్రేమ, సహోదరభావం, సేవా భావం కలిగి ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. క్రిస్మస్ కేకును కట్‌చేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో అత్తిలి పారిష్ ప్రీస్ట్ పాదర్ చైతన్యరాజు, కరస్పాండెంట్ సిస్టర్ జ్యోతి, ప్రిన్సిపాల్ ఫిలీకురియన్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

భీమవరం పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దాలి



మున్సిపల్ అధికారులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి

భీమవరం (ప్రకాశంచౌక్): రాష్ట్రానికి తలమానికంగా భీమవరం సుందర పట్టణంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరు అభివృద్ధిలో భాగస్వాములు కావాలి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ నాగరాణి భీమవరం సుందరీకరణ పనులపై జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, మున్సిపల్ అధికారులతో సమావేశమై చర్చించారు. ఈ సందర్భంగా నాగరాణి మాట్లాడుతూ భీమవరం అభివృద్ధికి ప్రతి ఒక్కరు తమ వంతు బాధ్యతగా ముందుకు రావాలని కోరారు. ఇప్పటికే ఏయే ప్రాంతాలలో ఏ యే అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలో? ప్రణాళికలను రూపొందించామని, ఆర్థిక వనరులను సమకూర్చేందుకు పలువురు దాతలతో కూడా చర్చించామన్నారు. ముఖ్యంగా పట్టణంలో చేపట్టే పనులకు సంబంధించిన డిజైన్లను కూడా ఖరారు చేశామని, ఇప్పటికే కొన్ని పనులను ప్రారంభించామని తెలిపారు. అమ్యూజ్మెంట్ పార్క్, లైవ్ డాల్ఫిన్స్ పార్క్ తదితర పార్కులు నిర్మాణాలతో పాటు, ఉన్న పార్కుల అభివృద్ధి, ఖాళీ ప్రదేశాల్లో, రోడ్డు కూడళ్లలో ఆకర్షణీయమైన కట్టడాలు, ఫౌంటెన్ లు, లైటింగ్, ఆర్నమెంటల్ ప్లాంట్స్ ఏర్పాటు, డివైడర్స్‌కు ఇరువైపులా అందమైన పెయింటింగ్స్, వెల్కమ్ ఆర్చిలు తదితరాల ఏర్పాటుకు ఆలోచన చేశామన్నారు. సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ పి.రాహుల్ కుమార్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి, లైన్ ఇంటర్నేషనల్ కె.కృష్ణంరాజు, మున్సిపల్ ఈఈ పి.త్రినాథరావు, డీఈలు అప్పలరాజు, శ్రీనివాస్, రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధించాలి

భీమవరం (ప్రకాశంచౌక్): ప్లాస్టిక్ వినియోగం విడనాడి పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వరరావు అన్నారు. భీమవరం రైతు బజార్ లో శ్రీవిజ్ఞాన వేదిక, పురపాలక సంఘం సంయుక్త ఆధ్వర్యంలో రైతులు, వినియోగదారులతో ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన ర్యాలీ, నమూనా గుడ్డ సంచుల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్ వినియోగం విడనాడాలని పిలుపునిచ్చారు. నిషేధిత ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా తగ్గించి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయడం అందరి బాధ్యత అని అన్నారు. రైతు బజార్ ఎస్టేట్ ఆఫీసర్ పి.కళ్యాణ్ మాట్లాడుతూ ప్లాస్టిక్ బ్యాగ్, సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నిషేధించాలని, గుడ్డ లేదా నారసంచులు వాడాలని సూచించారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి, షేక్ బేగం, చవ్వా నాగలక్ష్మి, నార్కిడిమిల్లి మంగతాయారు తదితరులు పాల్గొన్నారు.



ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

సప్త శ్రీనివాస క్షేత్ర దర్శనానికి ప్రత్యేక సర్వీసులు

భీమవరం (ప్రకాశంచౌక్): ధనుర్మాసంలో ఒకే రోజున సప్త (7) శ్రీనివాస క్షేత్రాలు దర్శించుకునేందుకు ప్రతి శనివారం ప్రత్యేక ఆర్టీసీ బస్సుల సదుపాయాలు ఏర్పాటు చేసినట్లు భీమవరం ఆర్టీసీ డిపో మేనేజర్ పీఎస్‌వీఎం సత్యనారాయణ మూర్తి తెలిపారు. కలియుగం దైవం వేంకటేశ్వర స్వామి క్షేత్రాలైన అప్పనపల్లి, వాడపల్లి, ద్వారకాతిరుమల, పారిజాతగిరి దర్శనం, అబ్బిరాజు పాలెం, కొడమంచిలి, అన్నవరప్పాడు దర్శనాలకు ప్రత్యేక ఆర్టీసి బస్సు సర్వీసులు అందుబాటులో ఉన్నాయని అన్నారు. ఈ బస్సులు ప్రతి శనివారం ఉదయం 5 గంటలకు బయలుదేరి అదే రోజున రాత్రి 8 గంటలకు డిపోకు చేరుకుంటాయని, పల్లె వెలుగు రూ.350, ఎక్స్‌ప్రెస్ రూ.400, అల్ట్రా డీలక్స్ రూ.500 చొప్పున ధరలతో ధనుర్మాస శ్రీనివాస దర్శన సర్వీసులు అందిస్తున్నామని, తెలిపారు. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 73829 24754, 96660 89036 నంబర్లకు ఫోన్ చేయాలని కోరారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ వై సురేష్ తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న డిపో మేనేజర్ పీఎస్‌వీఎం సత్యనారాయణ మూర్తి

గ్రామాభివృద్ధికి కృషి చేయాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ లోహిత్ జయ సాగర్

తణుకు టౌన్: గ్రామాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీడీఓ ఆర్ లోహిత్ జయ సాగర్ కోరారు. బుధదవారం తణుకు మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ సచివాలయ సిబ్బందికి నిర్వహించిన రెండు రోజుల శిక్షణ ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో చేపట్టే వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై సిబ్బందికి అవగాహన కల్పించారు. గ్రామాల్లో 17 లక్ష్యాలు, 9 థీమ్‌లు పంచాయతీల అభివృద్ధికి దోహదం చేస్తాయని వివరించారు. ఈవోపీఆర్డీ పీవీవీ రామ ప్రసాద్, ఏవో వి.కృష్ణ చంద్రరావు, సచివాలయంలో పనిచేసే వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

రేపు క్విజ్ పోటీలు

తణుకు టౌన్: తణుకు ఎస్‌కేఎస్‌డీ మహిళా కళాశాలలో ఈనెల 20న జాతీయ స్థాయి క్విజ్ పోటీలు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ యు.లక్ష్మీ సుందరి బాయి తెలిపారు. కళాశాల గణిత, భౌతిక, రసాయన, కంప్యూటర్, గణాంక శాస్త్ర విభాగాల ఆధ్వర్యంలో జాతీయ స్థాయి క్విజ్, పీపీటీ, ఫన్ స్టాట్, కోడింగ్, స్పెక్ట్రోమీటర్, ఎక్స్‌పెరిమెంట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులు ఫోన్ నెంబర్ 98481 87600లో తమ పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

మద్యం సీసాల స్వాధీనం

తాడేపల్లిగూడెం : గూడెం ఎక్సైజ్ పోలీసు స్టేషన్ పరిధిలో బుధవారం నిర్వహించిన దాడుల్లో ఒక వ్యక్తిని అరెస్టు చేశారు. గణపవరం మండలం వరదరాజపురం బెల్టు దుకాణం నిర్వహిస్తున్న వ్యక్తి నుంచి 24 డ్యూటీ పెయిడ్ మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ సీఐ ఇ.స్వరాజ్యలక్ష్మి, ఎస్సై మురళీమోహన్, సిబ్బంది పాల్గొన్నారు.

నారుమడులు పూర్తి చేయాలి

భీమవరం అర్బన్: దాళ్వా నారుమడులు త్వరితగతిన పూర్తి చేయాలని మండల వ్యవసాయాధికారి నిమ్మల శ్రీనివాస్ రైతులకు సూచించారు. బుధవారం స్థానిక విలేకరులతో నిమ్మల శ్రీనివాస్ మాట్లాడుతూ దాళ్వా సాగు 8 వేల 200 ఎకరాల్లో చేసే అవకాశం ఉందని చెప్పారు. సుమారు 400 ఎకరాల్లో నారుమడులలో పూర్తి చేయాల్సి ఉండగా ఇప్పటికే 200 ఎకరాల్లో నారుమడులు పూర్తి చేశారన్నారు. మిగిలిన రైతులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఇప్పటికే 90 శాతం సార్వా మాసూళ్లు పూర్తయ్యాయన్నారు. మిగిలిన 10 శాతం పంటకు సంబంధించిన రైతులు వాయుగుండం కారణంగా కోతలు మూడు రోజులు పాటు వాయిదా వేసుకోవాలని కోరారు.

ఎస్సీ ఉప వర్గీకరణపై వినతుల స్వీకరణ

తాడేపల్లిగూడెం రూరల్ : షెడ్యూల్ కులాల ఉప వర్గీకరణకు సంబంధించి నియమించిన ఏకసభ్య కమిషన్‌కు 2025 జనవరి 9వ తేదీలోపు వినతి పత్రాలను అందించవచ్చని ఏఎస్‌డబ్ల్యూఓ రామాంజనేయ రాజు ఒక ప్రకటనలో తెలిపారు. కమిషన్ ప్రధానంగా వివిధ ప్రభుత్వ శాఖలు, విద్యా సంస్థల్లో షెడ్యూల్ కులాల ఉప వర్గాల ప్రాతినిధ్యం, సామాజిక, ఆర్థిక, రాజకీయ, విద్యాపరంగా ఉన్న లోటుపాట్లను పరిశీలిస్తుందని పేర్కొన్నారు. ఆయా అంశాలపై కమిషన్‌కు నివేదించే వారు తగు ధ్రువీకరణ పత్రాలతో సమర్పించాలని సూచించారు. విజయవాడలోని ఏకసభ్య కమిషన్ కార్యాలయంలో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటలలోపు స్వయంగా అర్జీలు అందజేయవచ్చని తెలిపారు. అర్జీలు డైరెక్టర్, ట్రైబల్ వెల్ఫేర్, ఫస్ట్ ఫ్లోర్, కోనేరు లక్ష్మయ్య, స్ట్రీట్ మొగల్‌రాజుపేట, విజయవాడ, ఆంధ్రప్రదేశ్, 520010 అడ్రస్‌కు లేదా ఆఫీస్ ఇన్‌చార్జి ఫోన్ నెంబర్ 70930 77688లో సంప్రదించవచ్చని వివరించారు.

ప్రత్తిపాడులో నేడు మందిర ప్రతిష్ఠ

పెంటపాడు: మండలంలోని ప్రత్తిపాడు చింతల్లంక ప్రాంతంలో క్రైస్ట్ వర్షిప్ మందిర ప్రతిష్ఠ నిర్వహించనున్నట్టు పాస్టర్ సురేష్ తెలిపారు. ఉదయం 10 గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమానికి అంతర్జాతీయ సువార్తికులు డాక్టర్ జాన్‌వెస్లీ (రాజమండ్రి) పాల్గొంటారని పేర్కొన్నారు.

రేలంగిలో రెవెన్యూ సదస్సు

ఇరగవరం : రేలంగి గ్రామంలో బుధవారం రెవెన్యూ సదస్సులు జరిగాయి. స్పెషల్ ఆఫీసర్, ఆర్డీఓ, లీగల్ మెట్రాలజీ నాగరాజు, తహసీల్దార్ ఎం సుందర రాజు, డీటీ మాలతీ, పోతురాజు, సర్వేయర్లు పాల్గొన్నారు.

పశు వధశాలతో పర్యావరణ సమస్యలు

తణుకు టౌన్: తణుకు మండలం తేతలి గ్రామంలో నిర్వహిస్తున్న పశు వధశాలను (లేహ్యం ఫుడ్ ప్రొడక్ట్స్‌ను) అడ్డుకోకపోతే భవిష్యత్‌లో పర్యావరణ సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని గో సంరక్షణ సమితి నాయకులు ఓలేటి నారాయణ కుమార్ హెచ్చరించారు. బుధవారం తణుకు ఆర్యవైశ్య సంఘం భవన్‌లో జల్లూరి జగదీష్ అధ్యక్షతన నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జిల్లాలో మొత్తం 2 లక్షల పాడి పశువులున్నాయని, తేతలి పశు వధశాలలో రోజుకు 400 చొప్పున వధిస్తే ఏడాదికి పశు సంపద మొత్తం హరించుకుపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే జిల్లాలో పాడి పశువులున్నా స్వచ్ఛమైన పాల కొరత ఉందని, తేతలిలో పశు వధశాల కొనసాగితే పశువులతో పాటు తణుకు పరిశర ప్రాంతాలు తీవ్ర కాలుష్యంతో నిండిపోతాయని హెచ్చరించారు. గోసేవా సమితి నాయకులు కొండ్రెడ్డి శ్రీనివాసు, బ్యాంక్ రిటైర్డ్ మేనేజర్ కాకిలేటి రాజేంద్ర మాట్లాడుతూ తేతలి పశు వధశాలలో రోజుకు 7 లక్షల లీటర్ల నీటిని వినియోగించి, రసాయనాలు కలిసిన నీటిని వదిలేయడంతో పరిసరాలు కలుషితమవుతున్నాయని అన్నారు. దీంతో రాబోయే రోజుల్లో నీరు, వాయు కాలుష్యం పెరిగిపోయి తీవ్ర పరిణామాలు ఏర్పడతాయని తెలిపారు. కార్యక్రమంలో వివిధ వర్గాలకు చెందిన ప్రజలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఓలేటి నారాయణకుమార్

సహకార బ్యాంకులో సభ్యులే యజమానులు

తాడేపల్లిగూడెం : సహకార బ్యాంకులో సభ్యులే యజమానులని మాజీ ఎమ్మెల్యే, విశాఖ కోఆపరేటివ్ బ్యాంకు మాజీ చైర్మన్ మానం ఆంజనేయులు అన్నారు. పట్టణంలో ఆ బ్యాంకు 55వ శాఖను ఆంజనేయులు బుధవారం లాంఛనంగా ప్రారంభించి మాట్లాడారు. కో ఆపరేటివ్ రంగాన్ని నిర్వీర్యం చేయడానికి కేంద్ర ప్రభుత్వం, రిజర్వు బ్యాంకు విధానాలు ఉన్నాయని తెలిపారు. కో ఆపరేటివ్ రంగాన్ని సభ్యులే రక్షించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని వివరించారు. 1916లో ఏర్పాటు చేసిన బ్యాంకును మరో వందేళ్లు మనుగడ సాగించే విధంగా పునాదులు వేశామని తెలిపారు. బ్యాంకు చైర్మన్ చలసాని రాఘవేంద్రరావు మాట్లాడుతూ సభ్యుల సంక్షేమం ధ్యేయంగా బ్యాంక్ సేవలందిస్తుందన్నారు. వివిధ బ్యాంకుల చైర్మన్లు ఎం.వెంకటరత్నం, మహ్మద్ అమీర్, రంగరాజు, తదితరులు మాట్లాడారు. బీజేపీ నాయకులు డి.సోమసుందర్ హాజరయ్యారు.



బ్యాంకు ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఆంజనేయులు

అభయ గణపతికి పూజలు



అభయ గణపతి

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక రామచంద్రరావుపేటలోని శ్రీకృష్ణ యోగధ్యాన మందిరంలో అభయ గణపతికి బుధవారం పంచామృతాలతో అభిషేకాలు, సహస్ర అష్టోత్తర పూజలు, స్వామి వారికి నూతన వస్త్రాలు అలంకరణలు నిర్వహించారు. మందిర కార్యదర్శి ఇందుకూరి మోహన్‌రాజు పర్యవేక్షించారు.

నేడు యూపీఏ క్రిస్మస్

పెంటపాడు: తాడేపల్లిగూడెం కొండాయిచెర్వు ప్రాంతంలోని ఫెయిత్ చర్చిలో గురువారం ఉదయం యునైటెడ్ పాస్టర్ అసోసియేషన్ (యూపీఏ) క్రిస్మస్ ఘనంగా నిర్వహించనున్నట్టు రాష్ట్ర పాస్టర్ల సంఘ నాయకులు జీజే జ్యోతి ఆనంద్ ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యఅతిథులుగా వరల్డ్ ఫెయి త్ మిషన్ అధ్యక్షుడు రక్షణానందం, రూత్ రక్షణానందంలు హాజరవుతారని పేర్కొన్నారు. గూడెం నియోజకవర్గంతోపాటు, పలు మండలాల దైవజనులు, పాస్టర్లు, సేవకులు పాల్గొంటారని తెలిపారు.

సుస్థిర అభివృద్ధి సాధించాలి

ఇరగవరం : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాల్లో భాగంగా రెండో విడత రెండో రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ ఎ.శ్రీనివాస్, ప్రాజెక్ట్ డైరెక్టర్ కేసీహెచ్ అప్పారావు, జిల్లా విజిలెన్స్ అధికారి కె.పురుషోత్తమ్, విస్తరణాధికారి పీవీఎస్ నరసింహామూర్తి తదితరులు పాల్గొన్నారు.